**కామెడీ కథ**

# టేలెంటెడ్

**ఎం. మాధవీకృష్ణ**

**సుబ్బారావుకు గడ్డం పెరిగింది. మొహం పీక్కుపోయి కళ్ళక్రింద గుంటలు పడ్డాయి. రిజర్వు బ్యాంకు కొత్తనోటులా ఫెళఫెళలాడేవాడు గవర్నమెంటు రద్దు చేసిన నాణెంలా వేల్యూ పడిపోయినవాడిలా తయారయ్యాడు.**

**నిన్న మొన్నటిదాకా సెలయేరులా నెమ్మదిగా సాగే సంసారం వరద గోదారిలా, దుమికిపడే జలపాతంలా ఉధృతంగా మారింది.**

ఇంతటి కష్టానికీ సదరు కారణం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే...

ఇరవై నాలుగేళ్ళకే నాలుగు వ్రేళ్లూ నోట్లోకి పోయే జీతగాడైన సుబ్బారావు ఏరికోరి మరదలి వరసైన పల్లెటూరి సుందరిని పెళ్ళాడాడు.

అదేదో సినిమాలో చెప్పినట్లు రోజుకో మూర పూలు, వారానికో సినిమా, నెలకో పిక్నిక్కూ, సంవత్సరానికో టూరుగా- హాయిగా సాగిపోతున్న సంసారం సుందరికి, ప్రతి రాత్రి వసంత రాత్రి- ప్రతి గాలి పైరగాలిలా..చక్కని జీవితం సుబ్బారావుకి దక్కాయి.

ముచ్చటైన సంసారానికి ముద్దుల రూపాలు బుజ్జిగాడు, చంటితల్లి.

అన్నీ రొటీన్ అయ్యేటప్పటికి సుందరికి కూడా అంతోటి సంసారం పాత ఒక రోతలా అన్పించసాగింది. ఈమధ్య సుందరిని టేలెంటెడ్ జబ్బు పట్టుకుంది. ఫలానావిడ పాటలు బాగా పాడి ప్రైజులు కొట్టేసిందని... మరొకావిడ శారీస్ మీద వర్క్ బాగా చేస్తుందని, చుట్టుపక్కల వాళ్లతో కాంపౌండ్‌వాల్ మీద ముచ్చట్లు.. తనకేమీ తెలియదంటూ మధ్యమధ్యలో వాళ్ల చేసే కామెంట్లు.

తను కూడా పక్కింటి పంకజాక్షి, ఎదురింటి మీనాక్షి, వెనకింటి విశాలాక్షిల్లా గొప్పగా సోషల్‌గా మూవ్ అవ్వాలనే కోరిక పుట్టింది సుందరికి.

అది మొదలు..ఇంటిపట్టున వుండే సుందరి మహిళామండలిలో చేరిపోయింది. రెండ్రోజులు యోగా క్లాసులు, నాల్రోజులు ఎక్సర్‌సైజు, మెడిటేషన్ క్లాసులంటూ బిజీ అయిపోయింది.

ఓరోజు సుబ్బారావు ఇంటికొచ్చేటప్పటికి రెండు కేజీల పొటాటోలు పరపరా చెక్కు తీస్తూ కనిపించింది సుందరి.

''ఏమిటి విశేషం?'' అడిగాడు.

''రేపు మధ్యాహ్నం కాంపిటీషన్‌కి ప్రిపరేషన్'' చెప్పింది కళ్ళు చక్రాల్లా తిప్పుతూ.

''ఏం కాంపిటీషన్?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''మా మండలి వాళ్లు మహిళా దినోత్సవం సందర్భంగా రకరకాల గేమ్స్ పెడుతున్నారు. అందులో పొటాటో చెక్కుతీసే పోటీ కూడా వుందిట. నాకు కాస్త ముందుగా తెలిసిందిలే. అందుకే ప్రాక్టీస్ చేస్తున్నా'' గర్వంగా చెప్పింది.

ఆరోజు రాత్రికి పొటాటోతో కూర, చిప్స్..వాటిని కొద్దిగా ఉడికించి టి.వి.లో చూపించిన ప్రోగ్రామ్‌లా..పొటాటో పెరుగు చెట్నీ చేసింది సుందరి.

ఇంకోరోజు..లలితా సహస్రనామాల కాంపిటీషన్. చూడకుండా తక్కువ సెకన్లల్లో చెప్పిన వారికి మంచి గిఫ్ట్. ఆ వారమంతా..రాత్రింబగళ్లు సహస్రనామాల్ని కంఠస్తం చేస్తూనే వుంది సుందరి.

రోజూ రాత్రి తొమ్మిదయ్యేటప్పటికి సుందరి చేతి రుచికరమైన విందు..ఆపైన కమ్మని పొందు అలవాటైన సుబ్బారావు ఐ.ఎ.ఎస్‌కి ప్రిపేరయినట్లు, రాత్రిళ్లు కూడా పుస్తకాలు పట్టుకున్న సుందరిని చూస్తూ జుట్టు పీక్కోసాగాడు. ఇంతా చేస్తే ఆ ప్రైజు మరెవరో కొట్టేశారు.

దాంతో తన టేలెంట్ నిరూపించుకోవాలనే కోర్కె మరింత పెరిగింది సుందరికి.

మరో రోజు 'శ్రీమతి గుంటూరు' ప్రోగ్రామంటూ..ఐదు వేల రూపాయల ధగ ధగ లాడే ఫ్యాన్సీ చీర...వెయ్యి రూపాయిల బ్యూటీ పార్లర్ ఖర్చు..ఎత్తు మడమల కొత్త షూసు..చేతికి కాస్ట్లీ లెదర్ హ్యాండ్ బ్యాగు..వెరశి సుబ్బారావుకు ఏడెనిమిది వేల ఖర్చు. ఫైనల్ వరకూ వెళ్లిన సుందరికి ఫలితం దక్కలేదు.

''నేను రేపట్నుంచీ కొత్త ఉద్యోగం చేస్తున్నాను'' చెప్పింది సుందరి. పక్కనే బాంబు పేలినట్లయింది సుబ్బారావుకు.

''నీ చదువుకి ఏం ఉద్యోగం వస్తుందబ్బా!'' ఆశ్చర్యపోతూ అడిగాడు.

న్యూస్‌పేపర్ తెచ్చి చూపించింది. అది..ఆంధ్రా సి.ఎమ్. నలుగురు మహిళలకు 'చిన్నమొత్తాల పొదుపు పథకం' క్రింద ఎక్కువ డిపాజిట్ చేయించినందుకు అవార్డ్సు ఇస్తున్న ఫోటో.

ఆపినా..ఆగేట్లు లేదనుకున్న సుబ్బారావు నీరసంగా ''సరే, నీ ఇష్టం'' అన్నాడు.

ఆర్.డి. కలెక్ట్ చెయ్యటం కోసం ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం, అయింది సుందరికి. ఒకరేమో రేపు రమ్మంటారు. మరొకరేమో గంటాగి రమ్మంటారు.

చక్కగా ఇంటి పని చేస్కొని పిల్లల్ని స్కూలుకి, సుబ్బారావుని ఆఫీసుకి పంపి, కాస్తంత రెస్టు తీసుకునే సుందరికి మధ్యాహ్నపు నడక జ్వరాన్ని తెచ్చిచ్చింది.

సుబ్బారావుకి డాక్టర్ ఖర్చు, మందులు, జ్యూసుల ఖర్చు షరా మామూలు.

★ ★ ★

''ఏమండీ! రేపు ఓ పదివేలు డ్రా చేసి ఇవ్వరూ?'' చాలా రోజుల తర్వాత దగ్గర చేరి గోముగా అడుగుతుంటే కాదనలేకపోయాడు సుబ్బారావు.

ఆ పదివేలు పెట్టి డెయిలీ యూజ్ శారీస్, బోల్డన్ని కాస్మెటిక్స్ కొనేసింది సుందరి. అవన్నీ పట్టుకెళ్ళి తను కొత్తగా చేరిన కిట్టీ పార్టీలో సేల్స్‌కి పెట్టింది.

కొద్దిమంది అటూ ఇటూ త్రిప్పి చూసి వదిలేశారు. అవన్నీ కొన్నాళ్ళ పరిచయం మీద కానీ..సేల్ కావని అర్థం కాలేదు అమాయకపు సుందరికి.

మధ్య మధ్యల్లో అనాథ బాలికలకు..వృద్ధాశ్రమాలకు మహిళామండలి డొనేషన్లంటూ...సుబ్బారావు జేబులో నోట్లు నిదానంగా కదుల్తూనే వున్నాయి.


''మీరసలు నన్ను సరిగ్గా ఎంకరేజ్ చేయరు'' ఆరోజు భోజనాల టైంలో నిష్ఠూరంగా మాట్లాడింది సుందరి.

టాపిక్ తన మీదికి తిరిగేటప్పటికి పాలమారింది సుబ్బారావుకి.

''ఏ విషయంలో?'' మంచినీళ్ల గ్లాసందుకుంటూ అడిగాడు.

''నా టేలెంట్ బయటికి తెచ్చే విషయంలో'' వడ్డిస్తూ చెప్పింది.

''నేను దేనికీ కాదన్లేదే?'' ఆశ్చర్యంగా అడి



గాడు.

''అదే మరి. ఓ సలహా కూడా ఇవ్వరు ఇలా చెయ్యమని. అందుకే నేనే ఓ నిర్ణయం తీస్కున్నాను'' చెప్పింది సుందరి.

''ఏంటది?'' భయంగా అడిగాడు.

''నేను పిల్లల్ని బాగా పెంచుతానని మీరేగా చాలాసార్లు అన్నారు..? ఎలాగూ మనది సొంతిల్లు. అందుకే చిన్న పిల్లల క్రష్ పెడదామను కుంటున్నాను'' చెప్పింది.

ఈసారి పొలమారకుండానే రెండుగ్లాసుల నీళ్లు గడగడా తాగేశాడు.

''దానికి చాలా డబ్బు కావాలి. అంత డబ్బు మనకెక్కడిది?'' అడిగాడు.

''పిల్లల పేర్న ఫిక్స్‌డ్ వుందిగా. దాన్ని డ్రా చేద్దాం. నేను సంపాదించాక మళ్ళీ ఖాతాలో వేస్తాను'' ధీమాగా చెప్పింది.

మరుసటి రోజుకల్లా..చిన్న పిల్లల ఆటసామాను..మూడు చక్రాల సైకిళ్లు. బేబీ వాకర్‌లు..ఉయ్యాలలు..వాళ్ల మంచినీటి కోసం ఆక్వాగార్డ్ ఫిల్టరూ..వాళ్లేడిస్తే తిప్పటానికి, ఆకలేస్తే తినిపించటానికి..ఓ ఇద్దరు ఆయాలు..సుబ్బారావు ఇంటి ముందర వరండా నిండిపోయింది సందడిగా.

ఓ మంచి ముహూర్తంలో పదిమంది పసిపిల్లలతో 'కేర్ టేకర్' స్టార్ట్ చేసింది సుందరి.

రెండ్నెల్లు తిరిగేటప్పటికి ముప్పైమంది అయ్యారు. జాజిపూలలా సన్నగా, నీరసంగా వుండే పిల్లలు కూడా సుందరిది పెద్ద చెయ్యి కావటంతో బంతిపూలలా తయారయ్యారు.

రోజురోజుకీ పిల్లల్ని చేర్చుకోమని వచ్చేవాళ్లు ఎక్కువవుతున్నారు.

సుబ్బారావుకి అనుమానమొచ్చి తీగలాగితే డొంకంతా కదిలింది.

పేరెంట్స్ దగ్గర నెలకింతని..పుచ్చుకునే సుందరి- అంతకు రెండింతలు వాళ్లకు ఫారెక్స్‌లు, సెరిలాక్‌లు, పళ్ళరసాలు పట్టించటంతో క్రష్‌లో చేర్చేవాళ్లు ఎక్కువయ్యారు.

''ఇంకేం చేద్దాం? క్రష్ మూసేద్దాం'' లెక్కలు విడతీసి చెప్పిన సుబ్బారావుతో దిగులుగా చెప్పింది.

సరైన పోషణ లేక చిక్కి సగమైన బుజ్జి, చంటి కాస్తంత నిదానంగా ఓ పదిరోజులకి కోలుకోసాగారు.

గీ..బే..అనే పిల్లల ఏడుపులు ఇంటి నిండా లేక..సుబ్బారావుకు కూడా కొద్దిగా తేరుకున్నట్లయింది.

ఆ పదకొండో రోజు..''సుందరి..నీవంటి దివ్యస్వరూపము..'' అని పాడుకుంటూ గాల్లో తేలుతూ..ఇంటికి వచ్చిన సుబ్బారావుకు చేత్తో మేగజైన్‌తో ఎదురొచ్చింది సుందరి.

''ఏమండీ! ఇటు చూడండి. ఒకావిడ మధ్యాహ్నం పూట...కాలేజీలకు ఆఫీసులకు పులిహోర, పెరుగన్నం పొట్లాలమ్మేదిట. సంపాదించిందంతా పెట్టి ఇప్పుడు 'రైస్ వెరైటీస్' అని హోటల్..ఇంటర్వ్యూ వేశారు'' బుక్ వంచి చూపిస్తూ చెప్పింది.


చేతిలోంచి జారి నేలమీద పరుచుకున్న పూలని దీనంగా చూస్తూ నిలబడ్డ సుబ్బారావుని కుదుపుతూ అడిగింది సుందరి. ''నేనూ చేస్తాను. మీ ఆఫీసులో వాళ్ళకి చెబుతారా కొనమని?''

''బామ్మా..!'' గట్టిగా అరిచాడు సుబ్బారావు.

మనవడి కాపురం కోసం పట్నానికి బయల్దేరక తప్పింది కాదు పల్లెటూరి బామ్మకి.

రాగానే, ఆ ఇంటి పరిస్థితులు, సుందరి మీద చుట్టూ వున్న వాళ్ల ప్రభావం పసిగట్టేంది.

వీళ్లంతా సుందరిని ఎద్దేవా చెయ్యటం వల్లే ఆమె బాధ ఇంతింతై..వటుడింతై..అన్న చందాన పెరిగిందని అర్థమైంది. వాళ్ల కుటుంబాల అతీ..గతీ..తెల్సుకున్న బామ్మ ఒక్కొక్కరికీ..చురకల వడ్డన పెట్టేంది.




''మీ ఆయన ఒట్టి తిరుగుబోతటగా..మీ ఇద్దరికీ..క్షణం పడదటగా..మొగుడు పెళ్ళాన్ని చూస్కోటమే పెద్ద ఆస్తి ఆడదానికి. మా సుందరి మాత్రం నీలా కాదులే..అదృష్టవంతురాలు'' అంటూ ఎదురింటి మీనాక్షి మీద దాడి చేసింది.

''నీ కొడుకు దేశాల మీద పడి తిరుగుతున్నాడటగా? ఎవత్తినో లేవదీసుకుపోతే కేసయ్యిందట గదా! పెంపకమంటే మా సుబ్బారావుని పెంచినట్లుగా వుండాలి. అయినా మీ పట్నం వాళ్లకి టైమెక్కడలే?'' బాగానే తగిలాయి పక్కింటి పంకజాక్షికి.

ఇన్ని రోజులుగా సుందరి తిప్పలు, సుబ్బారావు కష్టాలు ఆనందిస్తున్న వాళ్లకి బామ్మని చూస్తే భయమేస్తోంది.

తనకూ...సన్మానం జరుగుతుందని బామ్మ వెళ్లేవరకూ కాంపౌండ్ గోడ మీద కన్పించకూడదనుకుంది వెనకింటి విశాలాక్షి.

''ఊళ్ళో వాళ్లనని ఏం లాభం? మన బుద్ధీ, జ్ఞానం మనకుండాలి. అయినా ఆడవాళ్ళు అవీ ఇవీ సాధించారంటే ఆర్థికంగా బాగలేకపోతేనో, ఏ త్రాగుబోతు వెధవలతోనో బాధలు పడుతూ పోరాడుతూ కొందరు..నిజంగానే ఏదైనా చేసి సాధించాలని తపన ఉన్నా, ఇల్లూ, సంసారం, చక్కబెట్టుకుంటూ సంవత్సరాల తరబడి ఓపిగ్గా నిరీక్షించి మరికొందరు..అంతేకానీ..నీలాగా తెల్లారేటప్పటికి మెడల్స్ పొందాలంటే అవుతుందా?'' అంటుగట్టుకు పోయిన సుందరి జుట్టు పాయలుతీసి గోరువెచ్చని నూనె రాస్తూ చెప్పింది బామ్మ.

నూనెతో బాటుగా..మొట్టికాయలు ఎక్కడ తినిపిస్తుందోనని కదలకుండా కూర్చుంది సుందరి.

''అయినా..నువ్వు కాపురానికొచ్చేక సంసారం పొదుపుగా చేస్కుంటూ పెళ్లయిన నాలుగేళ్ళకే మా వాడితో సొంతిల్లు కొనిపించావ్. పిల్లలు కానీ వాడు కానీ..ఓ జలుబూ..జ్వరం..అంటూ మంచాన పడటం నే విన్లేదు. వాడి మొహంలో పెళ్ళినాటి మెరుపు ఈరోజుకీ తగ్గలేదు. ఇవన్నీ నీటాలెంటు కాదుటే?'' అడిగింది బామ్మ.

''మరే ...అలా పొదుపు చేసి ఓ లక్ష..ఇలా పాడు చెయ్యక ఓ లక్ష..నువ్వు ఇన్నాళ్లుగా..సంవత్సరానికో రెండు లక్షలు సంపాదిస్తున్నట్లే...'' బామ్మకి వంత పాడాడు సుబ్బారావు.

వాతావరణం చల్లబడింది. తుపాను ఉధృతమూ తగ్గింది.

★ ★ ★

''బామ్మా! ఇకనుంచైనా ఇక్కడే వుండవే? ఆ పల్లెటూళ్లో ఒక్కత్తివీ ఎందుకు?'' ప్రయాణానికి సిద్ధమౌతున్న బామ్మని అడిగాడు సుబ్బారావు.

''నా వల్ల కాదురా..నాకు నా ఊరే ఇష్టం. అయినా..నేనెక్కడుంటే మాత్రం ఏమిటట? పొత్తిళ్ళల్లో పసిబిడ్డని వదిలి మీ అమ్మ..నాన్నా..కన్ను మూశారు. ఇన్నాళ్లుగా ఒంటి చేత్తో, ఇరవై ఎకరాల మాగాణి, పసిగుడ్డైన నిన్ను ఇంతదూరం లాక్కొచ్చాను.

నా టేలెంట్ ఎవరైనా గుర్తించారా? నన్నెవరైనా టాలెంటెడ్ అని చిన్నమాటైనా అన్నారా?'' గొణుక్కుంటూ..మూతి తిప్పుకుంటూ పెట్టె సర్దుకుంటోంది బామ్మ.

''హతవిధీ'' తల పట్టుకున్న సుబ్బారావుని చూసి పకపక నవ్వింది సుందరి.

## ఏకాగ్రత

**పెద్దహీరోలతో కలిసి సినిమాలు చేయాలని ప్రతితారకి ఉంటుంది. సంతోషంత చిత్రంతో అందర్నీ అలరించిన శ్రీయ ఇప్పుడు రజనీకాంత్ కొత్త చిత్రంతో అందర్నీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. అందుకేనేమో అస్సలు ఎవ్వరితోనూ సరిగ్గా మాట్లాడక ఏకాగ్రతతో ఆ సినిమా షూటింగ్‌లో పాల్గొంటోంది. 'రజనీకాంత్‌తో కలిసి నటించడం మరపురాని మధురానుభూతి. అందుకే ఆ అనుభవం పదికాలాలపాటు పదిలంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నా' అంటోంది శ్రీయ. ఎప్పటికైనా కమల్‌హాసన్, విజయ్‌కాంత్‌లతో కలిసి నటించాలని ఉందంటోంది.**

